# గౌతమీపుత్ర శాతకర్ణి శాతవాహనుడు

విశ్వనాథ సత్యనారాయణ గారు

(నాసికపట్టణములోని కొండచివర యొకగుహలో నొకశాసనములో నితనిగుఱించియున్నది. "ఇతనితల్లి గోతమి. ఇతడు రాజాధిరాజు. ధాన్యకటకము రాజధాని. మహేంద్ర వింధ్యావతపారియాత్ర సహ్యకృష్ణగిరిచకోరాదిపర్వతము లితనిరాజ్యములోనివి. విద్యానిధి. ఇతఁ డొక్కఁడే ప్రజ్ఞావంతుడు. ధనుర్విద్యావిశారదుడు. ఇతనిపరాక్రమము నాభాగనహుషజనమే జయ సగర యయాతి రామాంబరీషాదులను మించియుండెను." ఇవి శాసనములోని కొన్ని మాటలు.

శకయవనహూణులు పరదేశీయులు వచ్చి భారతదేశ మాక్రమించుకొనిరి. వారిలో క్షాత్రపు లనువా రొకతెగ. నహపానుడనువాడు మహాక్షాత్రపుడనుబిరుదుతో సౌరాష్ట్రము (Guzerat) ఆక్రమించుకొని కొంతవఱ కాంధ్రరాజ్యవిజృంభణ మాపినాడు. ఇతడు మహాక్షాత్రపునివంశనిర్మూలనముచేసి మరల నారోజులలో నాంధ్రసామ్రాజ్యము చిగుర్చచేసినాడు. ఇతనికాలము. క్రీ. శ ౧౩౩ మొ॥ ౧౫౪ వఱకు.)

"మునుముందు రణనిస్సహాణభేరికాశంఖ, సకలవాద్యము లుష్ట్రసమితి మోయ
నావెన్క వారకాంతాలి నాట్యమ్ములు, గీతికామాధుర్యరీతి జూప
పైన మేల్సరదార్లు బారులు తీరిచి ఘనజవాశ్వంబుల ఖదనుపోవ
వెనుక ధానుష్కులౌ వీరులు తెనుగురాజ్యపుబాహు లీధాత్రి యద్రువ నడువ
నచట తురగపదాతులు నచటి వెనుక సమదగజయూథికాసహస్రములమీద
బల్లెపుంబోటుతో రిపుప్రాణహరు లుక్కుతున్క లాంధ్ర భటాళి యొత్తిపోవ."

"ఆపై కంచురథాలిపై తెనుగువా రన్నన్న యొక్కొక్కడే
మోహం గల్గును ముష్టిఘాతముల దిఙ్మత్తద్విపేంద్రంబులన్
చాపాచార్యులు వారిదోః కలిత రక్షాశక్తిదుర్భేద్యులై
వే పోవం దొడగెన్ తెలుంగుపతి పృథ్వీచక్ర మల్లాడగన్."

"జయజయ! గౌతమీ సాధ్వీమహాగర్భ, జనితముక్తాఫల! జయముజయము
జయజయ! ఆంధ్రభూచక్రరక్షాదక్ష, సవ్యబాహాదండ! జయముజయము

జయజయ! పార్థైక సామాన్యఘనధను, శ్శాత్రవధిక్కృతరిపు! జయముజయము.
జయజయ! నలహరిశ్చంద్రపురూరవ, శ్చక్రవర్తిసమాన! జయముజయము
జయముజయ మాంధ్రనాయక! జయముజయము, బహుపరాకంచు వెనువెంట పైడిపొన్ను
వెండికఱ్ఱల నెత్తి దీవెనల జేసి, బట్టువారు కైవారముల్ పట్టుచుండ."

" లలితామోదభరప్రసూననవమాలాభూషితుం జేసి రు
జ్జ్వలసౌధాగ్రము లెక్కి కుంకుమము లాజల్ చల్లి రంభోజ నే
త్రలు క్రొంజీరచెఱంగుమాటుబడి యర్ధవ్యక్తమౌ నాననం
బుల శృంగారపుఁగోరచూపుల సుధాపూరంబు లూరించుచున్."

" కాళ్లకు పారాణి కన్నుల కాటుక, చెలువొప్పు ముత్తైదువలు ముసళ్లు
పసపుపూసిన మేలినొసలులపై వెడ, లైనకుంకుమబొట్టు లంద మెసగ
ముడుతలువడి కొంచెముగ వంగినయొడళ్లు, కనకాంబరమ్ముల కాంతితరుమ
లలితమంజీరమంజులనాదములతోడ, పుంజీభవన్మహాపుణ్యరాసు
లట్లు కదుముగ త్రిపురసంహారకేళి, పాటపాడుచు నెదురుగా వచ్చినారు
ఆంధ్రధారుణీధవుని సైన్యములకెల్ల విజయలక్ష్మీప్రసాదాంకవిధముఁబోలె."

" అతడు కాదటవె వెంకాంబ మాలవనాథు, కుత్తుక బల్లెమ్ము గ్రుచ్చినతడు
అంతవినమ్రుడమ్మా వంగి మనకు న,మస్కార మొనరించు మధురరీతి
చూచితే! తండ్రి! నీశూరతాశ్లాఘ్యప్ర,ధానబాహువులు యుద్ధమునయందు
శత్రునక్షోభాగజనితాసృగుదితవీ,రావతారమ్ములై యమరుగాత
మనుచు దీవించె ముసలిముత్తైదువోర్తు, గడచిపోవుసైన్యాగ్రభాగమునయందు
నుత్తమాశ్వంబుపై బోవు నొక్కయాంధ్ర, తరుణతాసీము! నీరావతారు జూచి."

" తనయరదంబునుండి పతి ధాత్రికి డిగ్గి కృతప్రణామ మ
య్యెను! తల నేలదాకుగతి వృద్ధసువాసిను లిచ్చుకుంకుమం
బును ప్రసవంబులుఁ గొని, నమోనమ యంచు రథంబునెక్కెనం
తన జయ మంత సిద్ధమ యనన్ దనసైన్యములెల్ల నార్వఁగన్."

" కాఱియలేక ధాన్యకటకంబున రక్షులు వెన్కగా బహి
ర్ద్వారము దాటి యాంధ్రవసుధాపతి యాపురివంక జూచినన్
క్రూరత శత్రురక్తములు గ్రోలగ జూచిన నాల్కలోపతా
కారభసంబు ధాన్యకటకంబు వెలార్చెను రాజుకంటికిన్."

" వేలయు లేని యంబునిధి వేగమునన్ జను నాంధ్రసైన్యజం
ఘాలత మందగించె క్షణకాలముమాత్రమ యాంధ్రవిశ్వవి
ద్యాలయ మిచ్చుస్వాగతము నందుటకై యమరావతీపురిన్
బాలకవుల్ పఠించు జయపద్యములన్ విని మెచ్చుకొంటకున్. "

" మానితగౌతమీసుతకుమారునిసైన్యము తెల్ల దాటి కృ
ష్ణానది, పశ్చిమోత్తరదిశాముఖమై చనుచున్ తెలుంగుమా
గాణపుటెల్ల దాటి చనగా నెదురయ్యెను వచ్చుచున్ ప్రతి
ష్ఠానపురంబునుండి దనసైన్యముతో పులమావి దండగా"

" గౌతమీసుతశాతకర్ణి యీశాతవాహనుడు తా నసలు దావాగ్నికీల
శ్రీపులమావి వాసిష్ఠీకుమారకుం, డాయువరాజు ఝంఝానిలంబు
ఇంక నేమయ్యె సుమ్మీ నహపానుడు, సౌరాష్ట్ర మింక భూస్థాపితంబ
క్షాత్రపు డేటికి గడియించుకొన్నాడు, శత్రుత గౌతమీపుత్రుతోడ
అనుచు గుసగుసలాడినా రాంధ్రభటులు, కొండ రవిజయారావములందు మాఱె
రెండుసైన్యంబులును ధరిత్రీతలంబు, పగిలిపోవగ సౌరాష్ట్రపథము నడచె"

" తెనుగు పొలాల జేని గడిదేఱిన బంటుల కాలిదుమ్ము న
ల్లనిపెనుభూతమై గగనలంబినియై పెనుగాలి రేగి ముం
దునకు వెలార్చగా బడుటతో నహపానుని రాజ్యలక్ష్మి తే
జును దొలఁగెన్ పయిన్ తెనుగుశూరులు రాజ్యముజొచ్చినంతలో

" మూలచ్ఛిన్నము లయ్యె దుర్గములు క్రమ్మన్ సైన్యముల్ పేర్చి కు
ద్దాలింపంబడె నశ్వసైన్యగజయూథంబుల్ హరింపంబడెన్
గాలింపంబడి యెల్లమూలబల ముగ్రం బాంధ్రసైన్యానల
జ్వాలాదగ్ధమయైన క్షాత్రపునివంశజ్యోతి చల్లారగన్. "

" సౌరాష్ట్రేశ్వరు శేషదుర్గశిఖరాంచన్మౌళిభాగంబుపై
తారామార్గ మలంకరింపబడియెన్ త్రైలింగరాజ్యధ్వజ
స్ఫారోదంచితలోహితచ్ఛటల నాసాయంసమారంభవే
ళారోచిస్సుల మందవాయుమృదులీలావీచికాశ్రేణులన్. "